అయ్యో.. 'రామచంద్ర'

చెరువు మత్తడి కింద పడిన గండి నుంచి వృథాగా పోతున్న నీరు (ఫైల్)

- రామచంద్రుని చెరువు మత్తడికి గండి
- వృథాగా పోతున్న సాగునీరు
- అన్నదాతల గుండెల్లో గుబులు
- శాశ్వత మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు

రాయపర్తి, సెప్టెంబర్ 15: మండలకేంద్రం లోని రామచంద్రుని చెరువు మత్తడి (రాతి కట్టడం) కింద పడిన బుంగ (గండి) నుంచి నీరు వృథాగా పోతున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎస్సారెస్పీ కాల్వ అనుసంధానంతో ఇరిగేషన్ శాఖ అధికారులు రామచంద్రుని చెరువును పూర్తిస్థాయిలో నింపారు. దీంతో ఏప్రిల్, మే నెలలో మండుటెండల్లో సైతం రామచంద్రుని చెరువు నిండు కుంటలా మారి గోదావరి జలాలతో కళకళలాడి మత్తడి దుంకింది. ఈ క్రమంలో చెరువులోని చేపల వేటను కంట్రాక్ట్ తీసుకున్న గుత్తేదారు అక్రమ పద్ధతుల్లో చెరువులోని నీటిని బయటకు పంపిస్తేనే తనకు చేపల వేట సులభతరం అవుతుందని రామచంద్రుని చెరువు మత్తడిని ఎక్స్‌కవేటర్‌తో పెకిలించినట్లు రైతులు చెబుతున్నారు. మత్తడికి మరమ్మతులు చేయాలని ఆరు నెలలుగా తాము మొరపెట్టుకున్నా పట్టించుకున్న నాథుడే లేడని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నీటి పారుదల శాఖ, రెవెన్యూ అధికారులు స్పందించి శాశ్వత మరమ్మతులు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

పంటలన్నీ నాశనం అయితానయ్

రామచంద్రుని చెరువు మత్తడి గండి నుంచి నీళ్లు వరద లెక్క వస్తున్నాయి. దీంతో కింది ప్రాంతంలో మేము వేసుకున్న నాట్లు, పంటలన్నీ సర్వనాశనం అవుతున్నాయి. ఇన్ని రోజులు వానలు లేక, బోర్లు సరిగా పోయక పెట్టిన నాట్లను పిల్లల లెక్క అపురూపంగా సాదుకున్నాం. ఇప్పుడేమో చెరువు మత్తడి మూలంగా మా పంటలన్నీ నాశనం పదహారుపాళ్లు అవుతున్నాయి. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– దండిగ యాకయ్య, రైతు

కాలం అయి కరువు ఒచ్చెటట్టున్నది

వానకాలమంతా అయిపోతున్న సమయంలో ఒక్కరోజే రాత్రి గట్టిగా వాన పడి మా ఊర్ల ఉన్న చెరువులన్నీ నిండి అలుగుపోస్తున్నాయి. కాలం పుష్కలంగా అయింది. ఇగ వానకాలం, యాసంగి పంటలకు ఢోకా లేదనుకున్నాం. కానీ, ఇంతలోనే రామచంద్రుని చెరువు మత్తడి బుంగ పడి నీళ్లన్నీ బయటకు పోతుండడంతో రైతులంతా గుబులు పడుతున్నారు. జర అధికారులు ఇటు దిక్కు సూడాలె. – కనిరబోయిన రమనీత, మహిళా రైతు

తాత్కాలిక రోడ్డుపై దిగబడిన ట్రాక్టర్‌ను బయటకు తీస్తున్న మరో ట్రాక్టర్ డ్రైవర్

నిన్న ఎడ్లబండి.. నేడు ట్రాక్టర్

- తాత్కాలిక రోడ్డుతో ప్రమాదాలు
- చెరువులో పడిపోతున్నా పట్టింపేది?

సంగెం, సెప్టెంబర్ 15: తాత్కాలిక రోడ్డుతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఎడ్లబండి చెరువులో పడిన ఘటన మరువకముందే ఆదివారం ట్రాక్టర్ దిగబడింది. నల్లబెల్లి తూర్పుతండాకు చెందిన ఓ గిరిజన మహిళ 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేస్తే వాహనం వెళ్లేందుకు దారి లేక రోడ్డు పక్కనే నిలిపివేశారు. దీంతో కుటుంబ సభ్యులు చేసేదేమీ లేక ఆమెను ఎత్తుకొచ్చి అంబులెన్స్ వరకు తీసుకొచ్చి వాహనంలో ఎక్కించి వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. ప్రజల గోడును ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైభవంగా తిరు కల్యాణోత్సవం

మట్టెవాడ, సెప్టెంబర్ 15: నగరంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి తిరుకల్యాణోత్సవాన్ని శనివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తిరుకల్యాణాన్ని నిర్వహించినట్లు బాలగణేశ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరుట్ల రామాచార్యులు తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-326316

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-318996

CHANGE OF NAME

★I, HALEEMUNNISA BEGUM (OLD NAME) R/o. H.NO.14-6-40/2, NIZAMPURA, MANDI BAZAR, WARANGAL, TELANGANA . CHANGED MY NAME AS SAJIDA HALEEMA (NEW NAME) W/o. MOHAMMED KHALIQUZZAMAN.
KMM

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

- జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి
- వసతి గృహాలపై అధికారులు శ్రద్ధ పెట్టాలి
- కలెక్టర్ సత్య శారద

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

పర్వతగిరి, సెప్టెంబర్ 15: విద్యార్థులు ఇష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కలెక్టర్ సత్య శారద సూచించారు. ఆదివారం ఆమె మండలంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహం, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ వెనుకబడిన బాలుర వసతి గృహం, ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గ్రహాల్లో విద్యార్థుల ఆరోగ్యం, ఆహారం, చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులు, వార్డెన్లకు సూచించారు. పాఠశాలలు, వసతి గృహాల్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలను తెరిపించారు. బాక్స్‌ల్లో విద్యార్థులు వేసిన ఫిర్యాదులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి హాస్టల్ తరగతి గదులు, పరిసరాలు, వంట గదిని పరిశీలించారు. వార్డెన్లు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించి, కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌ల్లో ఉన్న వంట సరుకులు, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. వసతి గృహాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని వసతి గృహాలను సందర్శించి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ వెంకటస్వామి, వార్డెన్లు ఉన్నారు.

రంగాపురంలో ఎల్‌టీ లైన్‌కు వేలాడుతున్న కొక్కేలు

విద్యుత్ చౌర్యం.. అధికారుల చోద్యం

నల్లబెల్లి, సెప్టెంబర్ 15: మండలంలోని పలు గ్రామాల్లో స్థానికులు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రంగాపురంలో ఎల్‌టీ లైన్‌కు ఒకేచోట పదుల సంఖ్యలో కొక్కాలు వేసి ఇండ్లకు విద్యుత్ వినియోగిస్తున్నారు. గ్రామాలు, తండాల్లో కొందరు మీటర్లు తీసుకోకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతుండడం వల్ల లోవోల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని మీటర్లు ఉన్న వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని మండలంలోని వినియోగదారులు కోరుతున్నారు.

పీఆర్టీయూ మండల కార్యవర్గం

అజీజ్

దుగ్గొండి, సెప్టెంబర్ 15: పీఆర్టీయూ మండల కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎంఏ అజీజ్, ప్రధాన కార్యదర్శిగా పోలజు భిక్షపతి, అసోసియేట్ అధ్యక్షుడిగా వీరన్న, కార్యవర్గ సభ్యులుగా పద్మశ్రీ, భానుమూర్తి, విజయలక్ష్మి ఎన్నికయ్యారు.

19కి శాంతి ర్యాలీ వాయిదా

కరీమాబాద్, సెప్టెంబర్ 15: మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని చేపట్టనున్న శాంతి ర్యాలీని ఈ నెల 19కి వాయిదా వేసినట్లు ఉర్సు దర్గా పీఠాధిపతులు నవీద్‌బాబా, ఉబేద్‌బాబా తెలిపారు. సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేస్తామని చెప్పారు. బందోబస్తుపై వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ ఉర్సు దర్గా పీఠాధిపతులు నవీద్‌బాబా, ఉబేద్‌బాబాతో మాట్లాడారు.

17 నుంచి మార్కెట్‌లో క్రయవిక్రయాలు

కాశీబుగ్గ, సెప్టెంబర్ 15: ఈ నెల 17న నుంచి ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల తెలిపారు. రైతులు వ్యవసాయ ఉత్పత్తులతో మార్కెట్‌కు వచ్చేలా అడ్డి వ్యాపారులతోపాటు కార్మికులు కృషి చేయాలని కోరారు.

అనాథ వ్యక్తికి దహన సంస్కారాలు

సంగెం, సెప్టెంబర్ 15: అనారోగ్యంతో మృతి చెందిన అనాథకు గ్రామస్తులు ఆదివారం దహన సంస్కారాలు నిర్వహించారు. ఎల్గూర్‌స్టేషన్ జీపీ పరిధిలోని రాంచంద్రుతండాలో 15 ఏళ్లుగా గుగులోత్ ఛత్రు నివాసముంటున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యంతో మృతి చెందాడు. ఊరంతా ఏకమై డీజే సౌండ్స్‌తో అంతిమయాత్ర నిర్వహించి దహన సంస్కారాలు నిర్వహించారు.

'నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి'

దుగ్గొండి, సెప్టెంబర్ 15: గణపతి నిమజ్జనంలో భక్తులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం ఆయన స్టేషన్‌లో మాట్లాడుతూ గణపతి శోభాయాత్రలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మండపాల నిర్వాహకులు, కమిటీల ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిమజ్జన సమయంలో చెరువుల వద్ద విధిగా అధికారుల సూచనలు పాటించాలన్నారు. నిమజ్జనం రాత్రి 10.30 గంటల్లోపు పూర్తి చేయాలన్నారు.

ఆధార్ అప్‌డేట్ పేరుతో వసూళ్లు

నల్లబెల్లిలో సీఎస్‌సీ సెంటర్ నిర్వాహకుడి చేతివాటం

మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సీఎస్‌సీ సెంటర్

నల్లబెల్లి, సెప్టెంబర్ 15: ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని కేంద్ర విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీన్ని అదనుగా భావించిన మండలకేంద్రంలోని కస్టమర్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడు తన సీఎస్‌సీ సెంటర్‌ను ఏకంగా సంచార కస్టమర్ సర్వీస్ సెంటర్‌గా మార్చి నారక్కపేట, కొండాపూర్, కన్నారావుపేట, బుచ్చిరెడ్డిపల్లె, పద్మాపురంతోపాటు అనేక గ్రామాల్లో తిరుగుతూ ఆధార్‌తో పాటు ఓటర్ ఐడీ అడ్రస్‌ల మార్పిడి చేస్తానంటూ అమాయక ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నాడు. ఆధార్ అప్‌డేట్‌కు రూ. 150, ఓటర్ ఐడీ అప్‌డేట్‌కు రూ. 100 వసూలు చేస్తున్నటట్లు తెలిసింది. ఉచితంగా చేయాలని ఆదేశాలు ఉన్నా నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై నల్లబెల్లి తహసీల్దార్ ముప్పు కృష్ణను వివరణ కోరగా.. 'రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకునేలా వెసులుబాటు కల్పించింది. సంచార సీఎస్‌సీ సెంటర్ నిర్వాహకుల చేతుల్లో ప్రజలు మోసపోవద్దు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం' అన్నారు.

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

దామెర చెరువు వద్ద లైట్లు ఏర్పాటు చేసిన మున్సిపల్ సిబ్బంది

నర్సంపేట రూరల్, సెప్టెంబర్ 15: తొమ్మిది రోజులపాటు విశేష పూజలు అందుకున్న గణపయ్య సోమవారం గంగమ్మ చెంతకు చేరనున్నాడు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నర్సంపేట డివిజన్‌లోని ఆరు మండలాలతోపాటు నర్సంపేట పట్టణంలో ఈ దఫా 1090కి పైగా గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. పట్టణంలోని విగ్రహాలను సర్వాపురం శివారు నర్సంపేట-కొత్తగూడ ప్రధాన రహదారిలోని దామెర చెరువులో నిమజ్జనం చేయనున్నారు. మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, అగ్నిమాపక శాఖల అధికారులు, సిబ్బంది దామెర చెరువు వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏర్పాట్లను నర్సంపేటటౌన్ సీఐ రమణమూర్తి, ఎస్సై అరుణ్ పరిశీలించారు. కాగా, ఆదివారం గురిజాలలో గణపతి నిమజ్జనోత్సవాన్ని ఆనందోత్సవాలతో నిర్వహించారు. మహిళలు, చిన్నారులు ఆటపాటల మధ్య గణపతి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు.

డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

- ఇండ్ల మధ్య చేరిన వర్షపునీరు
- దుర్వాసనతో ప్రజల అవస్థలు

చెత్త, రాళ్లతో నిండిన డ్రైనేజీ

చెన్నారావుపేట, సెప్టెంబర్ 15: డ్రైనేజీల నిండా చెత్తాచెదారం చేరడంతో నీరంతా ఇండ్ల మధ్య నిలుస్తున్నదని ప్రజలు చెబుతున్నారు. మండలకేంద్రంలో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయి. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు వరదనీరు పారకుండా ఇండ్ల మధ్యలో నిలిచినట్లు స్థానికులు వాపోతున్నారు. మండల కేంద్రంలోని కోనాపురం రోడ్‌లో బుర్ర రమేశ్ ఇంటి వద్ద మురుగు కాల్వలో చెత్త, రాళ్లు పేరుకుపోయాయి. నీరు బయటకు వెళ్లక నిలిచి ఉండడంతో దోమలు వృద్ధి చెంది దుర్వాసన వస్తున్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య పనులు చేసే వారు కరువయ్యారని వాపోతున్నారు. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

ఇండ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు

చెయ్యి ఎత్తితే షాకే..

- మండలంలో ప్రమాదకరంగా విద్యుత్ లైన్లు
- నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్

పల్లార్‌గూడ-మొండ్రాయి మెయిన్ రోడ్డులోని చేనులో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

సంగెం, సెప్టెంబర్ 15: మండలంలోని పలు గ్రామాల్లో పంట చేనుల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. చేతికందే ఎత్తులో ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులకు ఆటంకం గా మారుతున్నాయని వాపోతున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వ్యవసాయ పనులు చేస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పల్లార్‌గూడ-మొండ్రాయి ప్రధాన రహదారి పక్కన ఉన్న పత్తి చేనులో కరెంటు వైర్లు వేలాడుతూ ఉన్నాయి. కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేయడంతో స్తంభాలు ఒరిగి తీగలు లూజు అయినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి సరి చేయాలని రైతులు కోరుతున్నారు.

నిరుద్యోగ మహిళలకు ఉద్యోగావకాశాలు

కాశీబుగ్గ, సెప్టెంబర్ 15: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని మన అగ్రిటెక్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ చైర్మన్ పాశికంటి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రతి గ్రామానికి ఒకరు చొప్పున ఇంటర్ పాస్ అయిన మహిళలకు ఉద్యోగావకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్ట్ టైం, ఫుల్ టైం కోసం మంగళవారం నుంచి 21వ తేదీ వరకు ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని మన అగ్రిటెక్‌లో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. వివరాలకు www.manaagritech.com. వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

'హామీలను అమలు చేయాలి'

నల్లబెల్లి, సెప్టెంబర్ 15: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమ పోరు బిడ్డల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల సాంబారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించే వరకూ అలుపెరుగని పోరాటాలు చేశామని, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు 250 గజాల ఇంటి స్థలంతోపాటు డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు, ప్రభుత్వ గెజిట్ ఉద్యమకారులకు ప్రశంసాపత్రాలు, బస్సు, రైళ్లలో ఉచిత ప్రయాణ సౌకర్యంతోపాటు నెలకు రూ. 25 వేల పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు.



ఏఈవోను సన్మానిస్తున్న డీసీసీబీ డైరెక్టర్, రైతులు

ఉద్యోగి జీవితంలో బదిలీలు సాధారణం

గీసుగొండ. సెప్టెంబర్ 15: ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో బదిలీలు సర్వసాధారణమని డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేశ్ అన్నారు. గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ క్లస్టర్ ఏఈవో అబీద్ హుస్సేన్ బదిలీపై వెళ్తుండగా, ఆదివారం రైతు వేదికలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవోను రైతులు, అన్ని పార్టీల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్ సౌందర్య, వైస్ చైర్మన్ నరేందర్, సొసైటీ డైరెక్టర్లు స్వామి, జనగాం శ్రీనివాస్, స్వామి, రవి, రాజు, అశోక్, కిషన్, రైతులు సూరన్న, మధుకర్, హరికృష్ణ, యుగేంధర్, బాబు, పాల్గొన్నారు.

బ్యాగులను పంపిణీ చేస్తున్న రవికుమార్

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

నర్సంపేట, సెప్టెంబర్ 15: నర్సంపేటలోని లీడ్ లైబ్రరీ జాయిన్ హ్యాండ్స్ ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు ఆదివారం బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయిన్ హ్యాండ్స్ ఫౌండేషన్ బాధ్యులు రంజిత్, శశిధర్, విష్ణు, వినయ్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు బ్యాగులు అందించామన్నారు. దాతల సహకారాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లీడ్ గ్రంథాలయ వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడికి ఘనంగా పూజలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా విఘ్నేశ్వరుడికి భక్తులు తొమ్మిదో రోజు ఘనంగా పూజలందించారు. చివరి రోజు నిర్వాహకులు పోటాపోటీగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అండర్ రైల్వేగేట్ ప్రాంతంలో వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ప్రత్యేక పూజలు చేశారు. వరంగల్ 17వ డివిజన్ బొల్లికుంటలో వినాయక నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పూజా కార్యక్రమానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ రెడ్డి హాజరయ్యారు. శివనగర్‌లో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పూజలు చేశారు. నర్సంపేటకు చెందిన కళాకారుడు గోకా రామస్వామి వివిధ రూపాల్లో సబ్బు బిళ్లలపై వినాయకుడిని చెక్కారు. నర్సంపేటలోని శివాంజనేయస్వామి ఆలయంలో వేపచెట్టుపై వినాయకుడి ఆకారం కనిపించిందన భక్తులు తెలిపారు. ఖానాపురంలో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో ఎస్సై రఘుపతి పూజలు చేశారు. వర్ధన్నపేటలోని వివేకానంద సెంటర్, ఫిరంగిగడ్డ, ఇల్లందలో అన్నదానం చేశారు. వరంగల్‌లోని పలు వినాయక మండపాల నిర్వాహకులకు భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్ బహుమతులు అందజేశారు. వరంగల్ దేశాయిపేట రోడ్డు వర్తక సంఘం శాశ్వత అధ్యక్షుడు ఆడెపు రవీందర్ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమపూజ, సహస్ర నామం జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు. అలాగే, కొత్తవాడ జై గణేశ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పాల్గొన్నారు. 21, 22, 23వ డివిజన్లలో వినాయకుడిని పూజలందించారు.

నెక్కొండలోని గౌతమి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో యాజమాన్యం ఎకో ఫ్రెండ్లీ గణపయ్యకు పూజలు చేశారు. నెక్కొండలోని వాసవీ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటలో వినాయకుడి లడ్డూను రూ. 33,316లకు రిటైర్డ్ ఉద్యోగి చిదురాల సత్యనారాయణ కొనుగోలు చేశారు. సంగెంలో విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో వినాయకుడిని 21 రకాల కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరీగా అలంకరించారు. నల్లబెల్లిలోని మహాత్మాగాంధీ కాలనీలో గణనాథుడికి మహా చండీ యాగం నిర్వహించారు. యూత్ ఫర్ స్వచ్ఛ్ వ్యవస్థాపకుడు శానబోయిన రాజ్‌కుమార్ దుగ్గొండి మండలంలోని తిమ్మంపేట, వెంకటపురం, గిర్నిబావిలో గణనాథులను దర్శించుకున్నారు. తిమ్మంపేటలో స్టార్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పర్వతగిరి మండలంలోని శివపుత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మట్టెవాడలో ఎస్ఎస్‌కే కత్రి సేవా సమాజ్ ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమకొండలో నిర్వహించిన ఉత్తమ గణనాథుల పోటీల్లో వరంగల్ దేశాయిపేటలోని లక్ష్మీ మెగా టౌన్‌షిప్ వినాయకుడికి తృతీయ బహుమతి వచ్చింది. కాశీబుగ్గ చౌరస్తాలో వర్తక సంఘం ఆధ్వర్యంలో 10 వేల మందికి అన్నదానం చేశారు. 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు గుండేటి కృష్ణమూర్తి, వడిచర్ల సదానందం, గుల్లపల్లి రాజ్‌కుమార్, ఓరుగంటి కొమురయ్య, మండల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. వరంగల్ 14వ డివిజన్ మణికంఠకాలనీలో అన్నదానం చేశారు. బయ్యా స్వప్న, ఆశోక్ దంపతులు 216 కిలోల లడ్డూను స్వామి వారికి అప్పగించారు. అలాగే, వరంగల్ 20వ డివిజన్‌లోని యువ గణేశ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 116 కిలోల లడ్డూను ఊరేగించారు. పద్మనగర్‌లో స్వామి వారికి నక్షత్ర హారతి ఇచ్చారు.

కాశీబుగ్గలో అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్

కాశీబుగ్గ: పద్మనగర్‌లో నక్షత్రహారతి ఇస్తున్న భక్తులు

కలీమాబాద్: రంగశాయిపేటలో గణపతి సన్నిధిలో నన్నపునేని

సంగెం: శాకంబరి అలంకరణలో..